# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖపట్టణంలో ఏఐ గ్లోబల్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.
- ❖ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్స్ సహకారంతో డిజిటల్ కనెక్టవిటి మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు.
- ❖ రాష్ట్ర గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చేలా పల్లె పండుగ రెండవ దశ ప్రణాళికలను రూపొందించాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు.
- ❖ వెస్టిండీస్ తో జరిగిన రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

=====================

విశాఖపట్టణంలో ఏఐ గ్లోబల్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 87,520 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ఏఐ డేటా సెంటర్ వైద్యారోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో సేవలు అందించనుంది. విశాఖ నుంచి సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియా దేశాలతో సబ్ సీ-కేబుల్ ద్వారా ఈ గూగుల్ డేటా సెంటర్ అనుసంధానం కానుంది. విశాఖపట్నంలో ఒన్ గిగావాట్ కెపాసిటీతో డేటా సెంటర్ ఏర్పాటు కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పని చేస్తుందని, దీని ద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

=====================

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్స్ సహకారంతో డిజిటల్ కనెక్టవిటి మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భారత్ ఏఐ శక్తిలో భాగంగా న్యూ ఢిల్లీలో ఈరోజు గూగుల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య జరిగిన ఒప్పందం కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్విని విష్ణవ్ లతో కలిసి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీ

అందిపుచ్చుకోవటంలో భారత్ ప్రత్యేకమని.. ప్రతీ కుటుంబానికి ఏఐని దగ్గర చేసేలా ప్రయత్నిస్తామని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమం అనంతరం కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ... విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 10 వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా ఇతర సంస్థలూ విశాఖ నగరానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని ఆయన మాట్లాడుతూ...

(వాయిస్ 22 సెకన్లు)

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న కర్నూలు రానున్న నేపథ్యంలో ప్రజలందరు ఘన స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. ఈ రోజు కర్నూలులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం సరళీకృత జీఎస్టీని తీసుకురావటంతో ప్రజలందరు స్వాగతిస్తున్నారని చెప్పారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు, చిన్న పరిశ్రమలకు పెద్ద ఎత్తున ఊరటనిచ్చే విధంగా ఈ సరళీకృత GST ఉందన్నారు. 16వ తేదీన శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి అమ్మవార్లను ప్రధానమంత్రి దర్శించుకున్న అనంతరం ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని సందర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కర్నూలు నగరంలో జీఎస్టీ ర్యాలీ పాల్గొంటారు.

======================

పల్లెల్లో పట్టణ స్థాయి అభివృద్ధికి బాటలు వేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా పల్లె పండగ రెండవ దశ ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ముఖచిత్రం సంపూర్ణంగా మారేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. ఈ రోజు ఆయన క్యాంపు కార్యాలయంలో త్వరలో ప్రారంభం కానున్న పల్లె పండుగ 2.0 పై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రహదారుల అభివృద్ధి, నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు, గోశాలలు, మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

విరామం

======================

ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా విశాఖపట్టణం, తిరుపతి నగరాలను గుర్తించాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సముద్రతీర, మెరైన్ గమ్యస్థానంగా విశాఖను ఆధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ రోజు రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటక శాఖ మంత్రులతో జరుగుతున్న సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. దేశ పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరింత సహకారం అందించాలని గజేంద్ర సింగ్ షెకావత్ కు మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

కురుపాం బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న 65 మంది విద్యార్థినిలలో పూర్తిగా కోలుకున్న 59 మందిని ఈరోజు డిశ్చార్జ్ చేసినట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను మంత్రి పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో 146 మంది విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారని, వారిలో 65 మంది బాలికలను మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్ లో చేర్పించామని చెప్పారు. కేజీహెచ్ లో మెరుగైన వైద్యం అందించడం ద్వారా 59 విద్యార్థినిలు పూర్తిగా కోలుకొని వారి ఇళ్ళకు వెళ్లడం జరిగిందన్నారు.

=======================

గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్టణంలో ఏర్పాటు అయ్యేందుకు జరిగిన ఒప్పందం శుభ పరిణామని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. విశాఖను ఐటీ హబ్ గా మార్చుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌లకు ప్రజల తరఫున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గూగుల్ డేటా సెంటర్ రాకతో ఉత్తరాంధ్రలో అభివృద్ధి నూతన యుగం ప్రారంభమయ్యిందని వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ప్రపంచ పటంలో విశాఖకు కొత్త గుర్తింపు రానుందని, లక్షా 88 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయని చెప్పారు.

=======================

భారత్, వెస్టిండీస్ పురుష జట్ల మధ్య ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. 121 పరుగుల లక్ష్యఛేదనలో 63 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో ఈరోజు ఆటను ప్రారంభించిన భారత్ మరో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కేఎల్ రాహుల్ 58 పరుగులు, సాయి సుదర్శన్ 39 పరుగులతో రాణించారు.

=======================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

=======================